# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 17-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్‌లో పెట్టుబడులు పెట్టిన వారికి మెరుగైన ప్రతిఫలాలు లభిస్తాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.
- ❖ "ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో2025" ఈరోజు తిరుపతిలో ప్రారంభమైంది.
- ❖ దేశవ్యాప్తంగా పరిశోధనలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

=====================

దేశాభివృద్ధిలో ఆధ్యాత్మిక పర్యాటకం కీలక పాత్ర పోషిస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తిరుపతిలో ప్రారంభమైన "ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో 2025" కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తో కలసి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాదని.. అభివృద్ధికి ప్రధాన ఆదాయ వనరులని అన్నారు. మన సంస్కృతి, వారసత్వ పరిరక్షణలో దేవాలయాల పాత్ర కీలకమని... వీటిని ఆధునిక, సాంకేతికత వినియోగంతో మరింత ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు.

(వాయిస్ 20 సెకన్లు)

=====================

భారత్‌లో పెట్టుబడులు పెట్టిన వారికి మెరుగైన ప్రతిఫలాలు లభిస్తాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈరోజు ముంబైలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం మ్యూచువల్ క్రెడిట్

గ్యారెంటీ పథకాన్ని కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... గత మూడు బడ్జెట్లలో MSMEలకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఇందులో భాగంగా పూచీకత్తు లేకుండా యంత్రాలు లేదా పరికరాల కొనుగోలు కోసం 100 కోట్ల రూపాయల వరకు రుణాలను పొందేందుకు అవకాశం ఉందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 21వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=====================

ఢిల్లీలోని ఈరోజు ఉదయం భూ కంపం సంభవించింది. నోయిడా, గురుగ్రామ్ ప్రాంతాల్లో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించగా... రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 4.0గా నమోదయ్యింది. తెల్లవారుజామున 5 గంటల 36 నిముషాల ప్రాంతంలో 5 కిలోమీటర్ల లోతులో భూ ప్రకంపనలు సంభవించాయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. ప్రకంపనలు సంభవించిన సమయంలో భారీ శబ్దం వినిపించడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. కాగా దీనిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందిస్తూ... "ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని, భయాందోళనలకు గురి కావద్దని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

=====================

జాతీయ విద్యా విధానాన్ని రెండు నూతన పద్ధతుల్లో అమలు చేస్తున్నామని, ఇవి ఉద్యోగార్థులతో పాటు, ఉద్యోగ సృష్టికర్తలను కూడా తీర్చిదిద్దుతాయని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. న్యూఢిల్లీలోని ఢిల్లీ విశ్వవిద్యాలయం హిందూ కళాశాల 126వ వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలోని యువతకు ఉద్యోగ భద్రత, మంచి జీవన విధానం, ఆర్థిక సాధికారత ఎంతో అవసరమన్నారు. దేశవ్యాప్తంగా పరిశోధనలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం యోచిస్తోందని అన్నారు. భారతీయ పరిశ్రమలకు లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణం అందుబాటులో ఉందని, ఈ నిధులను పరిశోధన, ఆవిష్కరణలకు ఉపయోగించాలని కేంద్రమంత్రి సూచిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

విరామం

=====================

సీబీఎస్ఈ బోర్డు పరీక్ష ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నాయని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) వెల్లడించింది. సామాజిక మధ్యమంలో ప్రచారమవుతున్న ఈ వదంతులు తమ దృష్టికి వచ్చాయని తెలిపింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన సృష్టించాలానే ఉద్దేశంతో కొందరు వీటిని వ్యాప్తి చేస్తున్నారని, ఇటువంటి వాటిని నమ్మవద్దని పేర్కొంది. ఇప్పటికే దీనిపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపడుతున్నాయని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పరీక్షలు

సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు బోర్డు అన్ని ఏర్పాట్లు చేసిందని వెల్లడించింది. కాగా ఈ నెల 15న సీబీఎస్ఈ బోర్డు 10, 12వ తరగతి పరీక్షలు ప్రారంభం.. కాగా ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

=====================

దేశవ్యాప్తంగా ముఖ్యమైన 60 రైల్వే స్టేషన్లలలో నెలకొన్న రద్దీని నియంత్రించేందుకు రైల్వే శాఖ ప్రత్యేక హోల్డింగ్ జోన్స్‌ను ఏర్పాటు చేయనుంది. కీలక సమయాల్లో స్టేషన్లలో ప్రయాణీకుల రద్దీని నియంత్రించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. రద్దీ, పర్యవేక్షణ, నియంత్రణ, విపత్తు నిర్వహణ కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైల్వేశాఖ ఉపయోగించనుంది. దీనిపై అవగాహన కల్పించేందుకు స్థానిక అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. మరోవైపు ప్రయాణీకుల కదలికలను సజావుగా నిర్ధారించడానికి, ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో వారం పాటు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ప్లాట్‌ఫామ్ టిక్కెట్ల జారీని నిలిపివేసినట్టు స్పష్టం చేసింది.

=====================

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సెస్ (BSF), బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (BGB) మధ్య 55వ డైరెక్టర్ జనరల్ స్థాయి బోర్డర్ కో - ఆర్డినేషన్ సమావేశం ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభమైంది. ఈ సమావేశం ఈ నెల 20వ తేదీతో ముగుస్తుంది. BSF ప్రతినిధి బృందానికి డైరెక్టర్ జనరల్ దల్జిత్ సింగ్ చౌదరి నాయకత్వం వహిస్తుండగా, BGB ప్రతినిధి బృందానికి డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ మొహమ్మద్ అష్రఫుజ్జమాన్ సిద్ధిఖీ నాయకత్వం వహిస్తున్నారు. ఈ సమావేశంలో, సరిహద్దు కాపలా దళాల మధ్య మెరుగైన సమన్వయం, సరిహద్దు సంబంధిత అంశాలను చర్చించనున్నారు.

=====================

తెల్లవారుజామున ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో భూ ప్రకంపనలు చోటుచేసుకున్న అనంతరం కొన్ని గంటల వ్యవధిలో బిహార్ రాష్ట్రంలో మరోసారి భూకంపం సంభవించింది. ఉదయం 8 గంటల 2 నిమిషాల ప్రాంతంలో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 4.0గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. సివాన్‌లో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రకంపనలకు సంబంధించి ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరుగలేదు.

=====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 75 వేల 939 వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరకు 57 పాయింట్ల లాభంతో 75 వేల 996 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30.25 పాయింట్ల లాభంతో 22 వేల 959 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.87గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 75.05 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2 వేల 907 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

=====================

నిన్న రాత్రి జరిగిన దాడులలో రష్యన్ దళాలు 147 డ్రోన్లను ప్రయోగించాయని ఉక్రెయిన్ సైన్యం తెలిపింది. వీటిలో 83 డ్రోన్లను ఉక్రెయిన్ వైమానిక దళం కూల్చివేసిందని తెలియజేసింది.

=====================
=====================